క్లుప్తంగా

దివ్యాంగులకు వితరణ



నగదు అందజేస్తున్న హనుమాన్ బాయ్స్ కమిటీ సభ్యులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో దివ్యాంగులు ఆశ్రమానికి ముక్కాం హనుమాన్ డాల్ఫిన్‌బాయ్స్ కమిటీ సభ్యులు రూ.20 వేలు వితరణగా క్యాంపస్ డైరెక్టర్ శర్మకు మంగళవారం అందజేసారు. నగదుతో పాటు రూ.ఏడు వేల విలువ చేసే బియ్యం కూడా అందజేశారు. వినాయకచవితి ఉత్సవాలకు సేకరించిన మొత్తంలో మిగిలిన డబ్బులను దివ్యాంగుల ఆశ్రమానికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ డాల్ఫిన్‌బాయ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించండి

• రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటే మానసిక సమస్యలు దరిచేరవని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రెడ్‌క్రాస్ లైఫ్ టైం వలంటీర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆందోళనకు గురికావడం, నిద్రలేమి తదితర కారణాల వల్ల మానసిక సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో అంకాలజీ సేవలు

విజయనగరం ఫోర్ట్: క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో అంకాలజీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ డి.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆస్పత్రి 6వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సూపర్ స్పెషాలటీ వైద్య సేవలు కోసం గతంలో విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం విజయనగరంలోనే అందిస్తున్నామని చెప్పారు. 2017లోనే ఆస్పత్రిలో మోకళ్ల చిప్ప మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించామన్నారు. సంతాన లేమి సమస్యలు ఉన్న వారి కోసం అతి తక్కువ ఖరీదుతో ఐబీఎఫ్ ఫెర్టిలిటి సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. సమావేశంలో కె.మధు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

భోగాపురం: సాగరకవచం కార్యక్రమంలో భాగంగా తొలి రోజైన మంగళవారం భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీఐ బీవీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మెరైన్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తున్నదీ ఆరా తీశారు. చేపలకంచేరు, ముక్కాం, కోనాడ, చింతపల్లి సముద్ర తీర ప్రాంతాల్లో సాగరకవచంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి, మెరైన్ ఎస్ఐ పి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



రామతీర్థంలో కోలాట బృంద ప్రదర్శన

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానం ధర్మ ప్రచార వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార వారోత్సవాల సందర్భంగా మంగళవారం తంగుడుబిల్లి గ్రామానికి చెందిన పైడిరాజు బృందం ఆధ్వర్యంలో మహిళలు నిర్వహించిన భక్తి గీతాల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులకు దేవస్థానం తరపున ధర్మపథం సర్టిఫికెట్లను అందజేశారు.

పుస్తెల తాడు చోరీ

విజయనగరం క్రైమ్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడును వెనుక నుంచి వచ్చిన వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు.. ప్రదీప్ నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గౌరీ అనే మహిళ పక్క అపార్ట్‌మెంట్‌లో దుస్తులు ఇస్త్రీ చేసేందుకు నెత్తిమీద మూట పెట్టుకుని మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వెళ్తుంది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన వ్యక్తి ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని అప్పటికే సమీపంలో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



విజయనగరం: కంటోన్మెంట్ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయి. గతానికి భిన్నంగా ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా గ్రామాలు, పట్టణాలు ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు. ఆయా శిబిరాల్లో శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ ద్వారా ఆ సేవలు కూడా అందించనుంది. మొత్తంగా ప్రజారోగ్యానికి భరోసానిస్తుంది.

– సాక్షి నెట్‌వర్క్



పూసపాటిరేగ: చల్లవానితోటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెడికల్ కిట్ అందజేస్తున్న ఎంపీడీఓ రాధిక తదితరులు



భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విచ్చేసిన మహిళలు, వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెలిమర్ల రూరల్: బూరాడపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



డెంకాడ: రఘుమండలో రోగులకు మందులను అందజేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు తదితరులు

యువ వ్యాపారవేత్తలతో చాంబర్ యువజన విభాగం ఏర్పాటు

విజయనగరం అర్బన్: చాంబర్ ఆఫ్ కామర్స్ విజయనగరం కమిటీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యువ వ్యాపారవేత్తలతో చాంబర్ యువజన విభాగం స్థానిక చాంబర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పడింది. ఈ సందర్భంగా చాంబర్ ప్రతినిధులు మాట్లాడుతూ వ్యాపారస్తుల కుటుంబాలలో విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న యువత ఉద్యోగాలు విడిచిపెట్టి వ్యాపారంలోకి అడుగుపెట్టడం, నూతన ఆలోచనలతో ముందుకు సాగడం శుభపరిణామమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా నిలదొక్కుకునే విధంగా యువ వ్యాపారవేత్తలను తీర్చిదిద్దడానికి దోహదపడుతుందన్నారు. నూతన ఆలోచనలతో పారిశ్రామిక రంగంలో కానీ, వ్యాపార రంగంలో కానీ, పర్యాటక రంగంలో కానీ కొత్త ప్రాజెక్ట్స్ స్థాపించడం ముఖ్య ఆశయంగా నూతన విభాగం పని చేయాలని సూచించారు. పట్టణంలోని 250 మందికిపైగా ఉన్న యువ వ్యాపార వేత్తలు సభ్యులుగా చేరి నూతన కార్యవర్గాన్ని ఏర్పరచుకున్నారు.



చాంబర్ యువజన విభాగం కార్యవర్గం

అధ్యక్షుడిగా కార్తీక్

చాంబర్ యువజన విభాగం అధ్యక్షుడిగా గుడిశా కార్తీక్, కార్యదర్శిగా కేదారిశెట్టి వెంకన్నబాబు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా తూనుగుంట్ల నటరాజ్, కోశాధికారిగా అబ్దుల్ ఖుదుస్‌తో పాటు 20 మంది కార్య నిర్వాహక సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ పరిచయం చేసారు. ఈ నెల 17న స్థానిక చాంబర్ భవనంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరణ చేపడుతుందని ప్రకటించారు. యువజన విభాగం ముఖ్య సలహాదారులు పీఎస్‌సీ నాగేశ్వరరావు, చాంబర్ పూర్వ అధ్యక్షుడు ఎంవీ చలం తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తపాలా శాఖ అధికారులు

విజయనగరం టౌన్: భారత తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హెడ్‌పోస్ట్ మాస్టర్ కె.హరి పేర్కొన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో మంగళవారం జనంలోకి మనం అనే కార్యక్రమంపై మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు తపాలా శాఖ వివిధ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. పదేళ్లలోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ ఖాతాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాల రాయితీలను పొందవచ్చన్నారు. ఆధార్, తపాలా జీవిత బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ పి.సుందరనాయుడు, యు.గణపతిరావు, ఐపీపీబీ మేనేజర్ సిహెచ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ వద్ద ధర్నా

విజయనగరం పూల్‌బాగ్: డ్రైవర్లకు సంక్షేమ బోర్డు సాధన కోసం ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరు కార్యాలయాల ముందు చేపట్టనున్న ధర్నాల్లో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ఆటోడ్రైవర్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం శ్రీ వెంకటేశ్వర టాటా మ్యాజిక్ వ్యాన్‌ల ఓనర్ కం డ్రైవర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.అశోక్, పి.ఈశ్వరరావు, టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం/ఫోర్ట్: నగరంలోని కోట జంక్షన్‌లో గల విజయ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వార్షికోత్సవాల సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు కొరత దృష్ట్యా నిర్వహించిన శిబిరంలో 62 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్ మాట్లాడుతూ తలసేమియా పిల్లలకు, గర్భిణులకు రక్తం కొరత లేకుండా ఈ శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. యువత రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావటం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడే సామాజిక బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, కళ్యాణ్ , బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శివ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం మహాదానమని లక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వీరాస్వామి పేర్కొన్నారు. స్థానిక లక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో మంగళవారం రక్తదానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి అనారోగ్యం రాదని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలు తొలిగించాలన్నారు. తద్వారా రక్తదానం చేసేందుకు అందరూ ముందుకు వచ్చేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారన్నారు. కరెంట్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా రేపటి నుండి కరపత్రాల ద్వారా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేసి భవిష్యత్ పోరాటాలకు సిద్ధం చేస్తామన్నారు. పార్టీ నాయకులు బి.శంకర్రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెంలో ఉన్న శ్రీలక్ష్మీ సాయిరామ్ లేడీస్ హాస్టల్‌లో రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. స్థానిక తోటపాలెంలో ఉన్న హాస్టల్‌లో ఈ నెల 5వ తేదీ రాత్రి దొంగలు చొరబడి గదిలో ఉన్న ఇద్దరు మహిళల సెల్‌ఫోన్‌లు దొంగిలించారు. ఉదయం లేచి చూసేసరికి తమ మొబైల్స్ కనబడకపోవడంతో వార్డెన్‌కు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గదులన్నీ వెతికినా ఎక్కడా లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

సిరిమాను చెట్టు పూజలకు పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల కల్పవల్లి శ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టుకు పూజలు చేసేందుకు మంగళవారం భక్తులు తాకిడి ఎక్కువైంది. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలోని తుమ్మి అప్పారావు వారి కల్లాల్లో గుర్తించిన సిరిమాను చెట్టును పూజించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. విజయనగరం, నెల్లిమర్ల పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో వస్తున్నారు.



సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పైడితల్లి అమ్మవారి దీక్షలు పవిత్రం

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దీక్షలు పరమ పవిత్రమని, దీక్షాపరులందరూ అమ్మవారి సేవలో తరించాలని పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో తెలిపారు. స్థానిక అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం మండల దీక్షలు తీసుకున్న భక్తులు, గురుస్వాములతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పండగ నేపథ్యంలో అమ్మవారి అంబలం, మెట్ల పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. గురుస్వాములు ఎస్.అచ్చిరెడ్డి, మహేష్, రంజిత్ , నాని, పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అర్చన వి.జైన్ (నాగ్‌పూర్) పేర్కొన్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అర్గనైజేషన్ (జీతో) విజయనగరం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక తోష్నీవాలా భవన్‌లో ఆధ్యాత్మిక అంశాలను, యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వింగ్ ఆధ్వర్యంలో నూతనంగా జిల్లా శాఖ రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మెడిటేషన్‌పై పలు విషయాలను వెల్లడించారు. నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షురాలు రీమా కొఠారి, ఉపాధ్యక్షురాలు జ్యోతి బచావత్, కార్యదర్శిగా హర్షితా సురానాలు ఎంపికయ్యారు. వీరి ఆధ్వర్యంలో 34 సభ్యులను ఎన్నుకున్నారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల తదితరులు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
• 9, 20 డివిజన్‌లలో నూతన రోడ్లు ప్రారంభోత్సవం

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 9, 20వ డివిజన్‌లలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రోడ్లను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి ప్రారంభించారు. ఆయా డివిజన్‌లోని సుంకర వీధి, శాంతినగర్ వీధి, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో స్థానికుల వినతి మేరకు రోడ్లను నిర్మించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో అపరిష్కృత సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు నగర స్థాయిని పెంచే విధంగా కొత్త అందాల సంతరించుకుంటున్నాయని అన్నారు. ప్రధాన రహదారుల నిర్మాణంతో పాటు జంక్షన్ల అభివృద్ధి, ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు, మంచినీటి సౌకర్యం మెరుగుదల వంటి అనేక చర్యలు చేపట్టడం వల్ల ప్రజల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జోనల్ ఇన్‌చార్జి గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపడుతూ కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్, జోనల్ ఇన్‌చార్జి అల్లు చాణిక్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాయన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విజయనగరం: నగర అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రంలో చేపడుతున్న వివిధ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం పరిశీలించారు. కంటోన్మెంట్, మయూరి కూడలి వద్ద జరుగుతున్న రహదారులు, డివైడర్లు, ఇతర పనులను పరిశీలించిన ఆయన.. సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

• కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు ఆదేశించారు. నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అలాగే పారిశుద్ధ్య పనితీరును కూడా గమనించారు. ఇందులో దాసన్నపేట, ప్రశాంతి నగర్, ద్వారకా నగర్, సింగపూర్ సిటీ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడ నిర్మితమవుతున్న కాలువలు, బీటీ రోడ్ల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా అని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న రోజువారి పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సిబ్బంది, పారిశుద్ధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

బయోమెట్రిక్ శతశాతం పూర్తి చేయాలి



సీతారామునిపేటలో వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

• జేసీ మయూర్ అశోక్

నెల్లిమర్ల రూరల్: ఈ క్రాప్ నమోదు చేసిన రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయించాలని జేసీ మయూర్ అశోక్ సూచించారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని సీతారామునిపేట, ఏటీ అగ్రహారం, రామతీర్థం గ్రామాల్లో వరి పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం అందాలంటే ఈ–క్రాప్ నమోదు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులందరికీ బయోమెట్రిక్ ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ–క్రాప్ నమోదు కాని కారణంగా ప్రభుత్వ పథకాలు, రాయతీలకు రైతులు దూరం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు మాట్లాడుతూ నెల్లిమర్ల మండలంలో మొత్తం 8,250 ఎకరాల్లో పంటలను ఈక్రాప్ నమోదు చేశామని, వీఏఏ, వీఆర్ఓ బయోమెట్రిక్ శతశాతం, రైతుల బయోమెట్రిక్ 90 శాతం పూర్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు కోటేశ్వరరావు, తహసీల్దార్ ధర్మరాజు, ఏఓ పూర్ణిమ, ఏఈఓలు కూర్మారావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

• పతకాల పంట



విద్యుత్ ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఈ, ఈఈ

విజయనగరం ఫోర్ట్: తెలంగాణ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 45వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కంట్రోల్‌బోర్డు నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. విజయనగరం సర్కిల్ ఏపీఈపీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ పి.అనిల్‌కుమార్ 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. కె.మణిబాబు (జూనియర్ లైన్‌మన్) బాల్‌బ్యాడ్మింటన్‌లో రజత పతకం సాధించారు. వీరిని స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, విద్యుత్‌శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ ఈఈ పి.హరి అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు, విద్యుత్ లైన్లకు తగులుచున్న చెట్ల కొమ్మలను తొలగించడం కోసం ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాసన్నపేట, రాజీవ్ నగర్ కాలనీ, లంక వీధి, జొన్నగుడ్డి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.